
చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వస్తున్న మహిళ


మర్రిపాలెం రైల్వే హైస్కూల్ పోలింగ్ కేంద్రం ఆడారి అనంద్‌కుమార్, పేడాడ రమణికుమారి


కరాస వద్ద లైన్‌లో ఓటర్లు


ములగాడ పోలింగ్ కేంద్రం వద్ద అధికారులతో మాట్లాడుతున్న యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి


షిప్‌యార్డ్ డిగ్రీ కళాశాల వద్ద పోలింగ్ సెంటర్‌ను పరిశీలిస్తున్న క్రైమ్ డీసీపీ వెంకటరత్నం

ఓటు మురిసింది
చైతన్యం వెల్లివిరిసింది

ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు పోటెత్తారు.గతంతో పోలిస్తే ఈసారి భారీగా ఓటింగ్ శాతంనమోదైంది. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా భావించిన రాజకీయ పక్షాలు, ఓటర్లు పోలింగ్ కేంద్రానికివచ్చేలా ప్రోత్సహించాయి. ఓటు విలువనుతెలుపుతూ ఎన్నికల సంఘం నిర్వహించిన ప్రచారం కూడా పోలింగ్ పెరగడానికి దోహదపడింది. 2019లో 58.19 నమోదవగా 2024లో 65.05 శాతంతో రికార్డు పోలింగ్ నమోదైంది.


ఓటు హక్కును వినియోగించుకున్న 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ


మండుటెండను సైతం లెక్క చేయకుండా ...


తండ్రితో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న 58వ వార్డు కార్పొరేటర్ లావణ్య


ఓటు వేసిన అనంతరం 59వ వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్

58.14%
2019లో పోలింగ్
65.05%
(రాత్రి 10 గంటల వరకు)
2024లో పోలింగ్

గోపాలపట్నం : ఓటర్లు పోటెత్తారు. ఓటు వేసేందుకు భారీగా తరలివచ్చారు. పశ్చిమ నియోజకవర్గంలో సోమవారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. నియోజకవర్గంలో 222 పోలింగ్ బూత్ ఏర్పాటు చేయగా ఉదయం 6.30 గంటలకే ఓటర్లు క్యూ కట్టారు. భారీ క్యూలైన్లలో ఓటర్లు గంటల కొలదీ వేచి ఉండాల్సి వచ్చింది. ఈవీఎంల్లో సాంకేతిక లోపాల కారణంగా అక్కడకక్కడ ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభైన పోలింగ్ 9 గంటలకు చేరుకొనేసరికి 11.20 శాతం నమోదైంది. 9–11 గంటలకు 25.02శాతం, 11 నుంచి ఒంటిగంట వరకు 36.40శాతం, 1–3 గంటల వరకు 50.62 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం ఐదు గంటలకు 56.49 పోలింగ్ నమోదైంది. రాత్రి 10 గంటల వరకు 65.05 శాతం పోలింగ్ నమోదైంది. ఈ శాతం పెరిగే అవకాశం ఉంది.

పోలింగ్‌బూత్‌లను సందర్శించిన అభ్యర్థులు

పశ్చిమ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ బూత్‌లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఎక్కడ ఏరకమైన ఇబ్బందు లున్నాయి.. ఏజెంట్లు ఏవిధంగా పని చేస్తున్నారు. ప్రత్యర్థులు ప్రలోభాలు చేస్తున్నారా వంటివి పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసుకునే అవకాశం గురించి ఆరా తీశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్, టీడీపీ అభ్యర్థి గణబాబు ఆయా పోలింగ్ బూత్‌లను పరిశీలించారు.

ఉత్సాహంగా పాల్గొన్న కొత్త ఓటర్లు

కొత్త ఓటర్లు ఉత్సాహంగా ఓటు వేశారు. తొలి ఓటును నీతి నిజాయతీ గల అభ్యర్థులకే వేశామని చెప్పారు. నా మొదటి ఓటును సద్వినియోగించుకున్నందుకు సంతోషంగా ఉందని పలువురు తెలిపారు.

ఓటు వేసిన ఆడారి ఆనంద్‌కుమార్

వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మర్రిపాలెం రైల్వే పాఠశాలలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీడీపీ అభ్యర్థి గణబాబు గోపాలపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు.

పారిశ్రామిక ప్రాంతంలో ..

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ సోమవారం నాడు ప్రశాంతంగా జరిగింది.ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందు ఉదయం 6.30 గంటలకే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.7 గంటల నుంచి పోలింగ్ మొదలైంది. యువతీయువకులు ఎక్కువ మంది ఈసారి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం నుంచి ఎండ ఎక్కువగా ఉండడంతో 3 గంటల వరకు పోలింగ్ మందకొడిగా జరిగింది. 3 గంటలు దాటిన తరువాత నుంచి మళ్లీ ఓటర్లు పోలింగ్ బూత్‌లకు క్యూ కట్టారు. 58వ వార్డు పరిధిలో 14 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఇక్కడ 80 శాతం ఓటింగ్ జరిగింది. అలాగే 59వ వార్డులో 17 పోలింగ్ కేంద్రాలకు గాను 60 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. 60వ వార్డు పరిధిలో 15 పోలింగ్ బూత్‌లకు గాను 62 శాతం ఓటింగ్ నమోదయింది. 61వ వార్డు పరిధిలో 15 పోలింగ్ బూత్‌లకు గాను 70 శాతం ఓటింగ్ నమోదైంది.

ఓటు చైతన్యం

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గపరిధిలోని 52,90 వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచే క్యూ లైన్లలో ఓటు వేసేందుకు వేచి ఉన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా మధ్యాహ్న సమయంలో పోలింగ్ కేంద్రాలు ఖాళీగా కనిపించినా, తిరిగి సాయంత్రం ఓటర్లు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ పర్యవేక్షణలో తగిన ఏర్పాట్లు చేశారు. 52వ వార్డు స్టెల్లా మేరీ స్కూల్లో ఎండ ఇబ్బందులు తొలగిలే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్లు ఓటర్లు వేచి ఉండేందుకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. కరాస జీవీఎంసీ స్కూల్లో క్యూ లైన్లలో ఓటర్లు ఎక్కువ సేపు వేచి ఉండకుండా పోలీసులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వేర్వేరు లైన్లుగా ఏర్పాటు చేసి, కేంద్రాల్లోకి పంపించారు. 90వ వార్డు పరిధిలోని పలు కాలనీలకు చెందిన ఓటర్లు బుచ్చిరాజుపాలెం సెయింట్ ఆన్స్ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ పోలింగ్ కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మర్రిపాలెం స్కూల్లో కుటుంబ సభ్యులతో కలసి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కంచరపాలెంలో...

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జీవీఎంసీ 56, 57 వార్డులు కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104ఏరియా, మర్రిపాలెం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు బారులుదీరారు.197 పోలింగ్ బూత్‌లో సుమారు 1,400 మంది ఉండడంతో సాయంత్రం 8 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఓటింగ్ సజావుగా సాగింది. ఓటర్లు స్వచ్ఛందంగా వచ్చి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ఆయా కేంద్రాల్లో సుమారు 62 శాతం పోలింగ్ జరిగినట్లు పశ్చిమ నియోజకవర్గ-24 ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు.


52వ వార్డు కరాస పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేసేందుకు వచ్చిన మహిళలు

విశాఖ పశ్చిమలో నమోదైన పోలింగ్ శాతం

ఉదయం 7 నుంచి 9 గంటల మధ్య **11.20%**	ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య **25.02%**	ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ **36.40%**
మధ్యాహ్నం 1 గంట నుంచి 3 వరకూ **50.62%**	మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ **56.49%**	రాత్రి 10 గంటల సమయానికి.. **65.05%**


కరాస పోలింగ్ స్టేషన్ వద్ద వీల్ చైర్‌లో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధుడు


గుల్లలపాలెం ప్రైమరీ స్కూల్ సెంటర్‌కు వీల్ చైర్‌పై ఓటు వేసేందుకు వస్తూ..


తొలిసారి ఓటు వినియోగించుకున్న యువ ఓటర్ల ఆనందం


లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాలలో ఈవీఎంకు సీలు వేస్తున్న పోలింగ్ సిబ్బంది


స్టెలా మేరీ స్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు


షిప్‌యార్డ్ కళాశాల పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు

నవతరం కదిలింది

మల్కాపురం : ఓటు వేసేందుకు యువతరం కదిలింది. యువతీయువకులు తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుని మురిసిపోయారు. మంచి చేసే నాయకుడికే ఓటేశామని చాటిచెప్పారు.

చాలా సంతోషంగా ఉంది



తొలిసారిగా ఓటు వినియోగించుకున్నా..చాలా సంతోషంగా ఉంది. నా చదువుకు దోహద పడిన పార్టీకే ఓటు వేసి కృతజ్ఞతలు తెలుపుకున్నా.. విశాఖ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓటు వేశా. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగల నాయకుడికే ఓటేశాను.

–సమత నూనెల, మల్కాపురం

ప్రలోభాలకు లొంగకుండా..



తొలి ఓటు వేసే అవకాశం వచ్చింది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీతో ఓటు వేశాను. చాలా ఆనందంగా ఉంది. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం దృష్టిలో పెట్టుకుని నా ఓటును వినియోగించా.

–మనోజ్‌యాదవ్, గాంధీజీవీధి

మేలు చేసే నాయకుడికే ఓటేశాం



మా కుటుంబానికి అన్ని విధాలు మేలు చేసిన నాయకుడికే మా తొలి ఓటు వేశాం. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ఆయా పార్టీలు ఇచ్చిన మేనిఫెస్టో..అవి ఎంతవరకు అమలు చేయగలరు వంటి దృష్టిలో పెట్టుకొని ఓటు వేశాం.

– వైసీవీ విక్రమ్, వై.కుసుమాంజలి, ప్రకాష్‌నగర్


ఓటింగ్ సరళిని తెలుసుకుంటున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, పార్టీ నేత పేడాడ రమణి కుమారి తదితరులు


ఆర్పీపేట పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్ల స్లిప్పులు అందిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి ఆడారి మాలతి


కంచరపాలెం ఇండస్ట్రియల్ కేంద్రీయ పాఠశాల వద్ద బారులుదీరిన ఓటర్లు


పోలింగ్ సమయం దాటినా క్యూలైన్లో వేచి ఉన్న ఓటర్లు

వార్ వన్ సైడే

వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పోలింగ్ శాతం గణనీయంగా పెరగడం చాలా ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. 65.05 శాతం (రాత్రి పదిగంటల వరకు) పోలింగ్ నమోదైంది. ఇంకా ఓటర్లు క్యూలో ఉన్నారు. పోలింగ్ శాతం ఇంకా పెరుగుతుంది. వృద్ధులు, మహిళలు ఈసారి చాలా స్పష్టంగా తీర్పు చెప్పందుకు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారన్నారు. ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలు నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోకే జమ కావడం..మహిళల ఆర్థిక ఇబ్బందులను తొలగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలిపేందుకు మహిళలు, వృద్ధులు ఓటు వేసేందుకు తరలి వచ్చారని చెప్పారు.. నియోజకవర్గంలో పలు పోలింగ్ కేంద్రాలు సందర్శించిన ఆనంద్‌కుమార్ మీడియాతో మాట్లాడారు. జగనన్న సంక్షేమ పథకాలు అందుకున్నవాళ్లంతా ఇలా ఓట్లపండగలో పాల్గోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. తన గెలుపు ఖాయమని ఈసందర్భంగా ఆడారి ఆనంద్‌కుమార్ వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పాటు, తాను చేసిన సేవా కార్యాక్రమాలను ప్రజలు గుర్తించారని, అందుకే ఇంత భారీ స్థాయిలో ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఆడారి ఆనంద్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, నియోజకవర్గ పరిశీలకురాలు పేడాడ రమణికుమారి తదితరులు పాల్గొన్నారు.


గోపాలపట్నం బాలుర హైస్కూల్ వద్ద ఆడారి ఆనంద్ కుమార్, బెహరా భాస్కరరావు

పశ్చిమలో 65.05 శాతం పోలింగ్

- రాత్రి పది గంటలకు అందిన వివరాల మేరకు..
- ఇంకా పెరిగే అవకాశం
- రికార్డు సృష్టించిన ఓటర్లు
- ఓటు వేసేందుకు తరలివచ్చిన వృద్ధులు, మహిళలు, యువ ఓటర్లు
- అధికారుల సమష్టి కృషి ఫలితం

గోపాలపట్నం : విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో పోలింగ్ రికార్డు స్థాయిలో జరిగింది. వృద్ధులు, మహిళలు, యువకులు ఈ సారి భారీగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఉదయం 6.30 గంటల నుంచే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మొదట్లో పలు చోట్ల ఈవీఎంలు నెమ్మదించినా విసుకు చెందకుండా ఓటు వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ అధికారులు సమష్టిగా ఓటు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించారు. 2014 ఎన్నికల్లో 59.93 శాతం, 2019లో 58.14 శాతం పోలింగ్‌నమోదైంది. 2014లో జరిగిన ఎన్నికల పోలింగ్‌లో విశాఖ పశ్చిమ ఆఖరుస్థానంలో నిలిచింది. దీంతో 2024లో ఎన్నికల్లో కచ్చితంగా ఓటింగ్ శాతం పెంచాలని అధికారులు కృషి చేశారు. జీవీఎంసీ వేసవి చలివేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రాంతంలో ఓటు విలువ తెలియజేప్పేలా నినాదాలతో కూడిన బోర్డులు ఏర్పాటు చేశారు. స్వచ్ఛంధ సంస్థల సహకారంతో కళాశాలల్లో అవగాహన కల్పించారు. ఓటు విలువ తెలియజెప్పారు. కొత్త ఓటర్లను చేర్పించడంలోనూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో పశ్చిమ నియోజకవర్గంలో 2014,2019లో మించి 2024లో 65.05 శాతం (రాత్రి పదిగంటల వరకు) భారీగా పోలింగ్ నమోదైంది. పశ్చిమలో ఇది రికార్డు పోలింగ్ శాతంగా అధికారులు పేర్కొన్నారు. వృద్ధులు, మహిళలు, యువతీయువకులు భారీగా ఓటింగ్‌లో పాల్గొనడంతో అధికారులు కృతజ్ఞతలు తెలిపారు.


షిప్‌యార్డ్ కళాశాల్లో ఈవీఎం మొరాయించడంతో వేచి ఉన్న ఓటర్లు